అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people



మాజీ నక్సల్స్‌కు పునరావాసంపై సమీక్ష

- జిల్లాలో అర్హులైన 11 మందికి ఇళ్ల స్థలాల కేటాయింపుపై ప్రధాన చర్చ
- ప్రభుత్వ లేదా ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించాలని అధికారులకు ఆదేశం
- సమన్వయంతో పనిచేసిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, సీపీ ఎన్ శ్వేత

03

శుక్రవారం 28, నవంబర్ 2026 | సంపుటి : 03 | సంచిక : 260 | పేజీలు : 07 | /aksharadarbar



స్నాతకోత్సవానికి కేయూ ముస్తాబు


- రేపు ఘనంగా వేడుకలు
- అధ్యక్షత వహించనున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- ముఖ్య అతిథిగా పద్మశ్రీ బీవీఆర్ మోహన్ రెడ్డి
- 91 మందికి పీహెచ్‌డీ పట్టాలు, 408 మంది విద్యార్థులకు బంగారు పతకాల ప్రదానం
- 151 మంది సభ్యులతో 12 కమిటీల ఏర్పాటు
- వివరాలు వెల్లడించిన వీసీ ఆచార్య కె ప్రతాప్ రెడ్డి

02

పార్లమెంటు సమావేశాల డేట్ ఫిక్స్

- 30న లోక్‌సభ, డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశాలు
- డిసెంబర్ 3 వరకు సాగనున్న ఉభయ సభల కార్యకలాపాలు
- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం

03



ప్రజల సొమ్ము అధికారుల భోగం!

పారిశుధ్య సిబ్బందితో సొంత సేవలు.. ప్రజాధనానికి తూట్లు

వివిధ ప్రభుత్వ శాఖల్లో కొంతమంది అధికారులు నిబంధనలను పాతరేస్తున్నారు.తమస్వప్రయోజనాలకోసంఅధికారదుర్వినియోగానికి పాల్పడుతున్నారు. తాము పని చేసే కార్యాలయంలోని ప్రభుత్వ సిబ్బందిని సొంత పనులకు వినియోగించుకుంటున్నారు. అద్దె వాహనాల స్థానంలో సొంత వెహికల్స్ వాడుతూ ప్రభుత్వ నిధుల నుంచి రెంట్ పొందుతున్నారు. తాజాగా భూపాలపల్లి జిల్లాలో ఇలాంటి ఆరోపణలపై సర్వత్రా చర్చ జరుగుతుంది. జిల్లా కేంద్రమైన భూపాలపల్లి మున్సిపాలిటీలోని ఒక అధికారిపై ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదుతో ఆఫీసర్స్ అధికార దుర్వినియోగంపై ప్రస్తుతం హాట్ టాపిక్ నడుస్తుంది.

– అక్షరదర్బార్ , హనుమకొండ

- డ్రైవర్, వంట మనుషులు పారిశుద్ధ్య కార్మికులే
- ముగ్గురు సిబ్బందితో ఒకరి సేవ.. మరో ఉన్నతాధికారికి ఇంకొకరు
- టాక్సీ ప్లేట్ కు అద్దె.. ఓన్ ప్లేట్ కారులో అధికారి దర్జా
- కాగితాలపై రెంట్ వాహనం.. రోడ్డుపై సొంత కారు
- భూపాలపల్లి మున్సిపాలిటీలో అడ్డగోలు వ్యవహారం.. ఫిర్యాదుల వెల్లువ

02



కొత్త బోర్లు వేయొద్దు

- అనుమతి లేకుండా వేస్తే వాహనాలు సీజ్ చేస్తాం
- వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలకు భూగర్భ జల శాఖ అనుమతి తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ స్పష్టం

02

అడ్డుగా ఉన్నాడని భర్తను కడతేర్చిన భార్య

- ప్రియుడితో కలిసి నిద్రిస్తున్న భర్త గొంతు నులిమి హత్య
- గుండెపోటుగా చిత్రీకరించేందుకు నిందితుల యత్నం..
- పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి అసలు నిజం
- గూడూరు మండలం అయోధ్యపురంలో ఘటన.. ఇద్దరు నిందితుల అరెస్ట్

03



ప్రజల సొమ్ము.. అధికారుల భోగం

- పారిశుద్ధ్య సిబ్బందితో సొంత సేవలు
- ప్రజాధనానికి తూట్లు
- డ్రైవర్, వంట మనుషులు పారిశుద్ధ్య కార్మికులే
- ముగ్గురు సిబ్బందితో ఒకరి సేవ.. మరో ఉన్నతాధికారికి ఇంకొకరు
- టాక్సీ ప్లేట్ కు అద్దె.. ఓన్ ప్లేట్ కారులో అధికారి దర్జా
- కాగితాలపై రెంట్ వాహనం.. రోడ్డుపై సొంత కారు
- భూపాలపల్లి మున్సిపాలిటీలో అడ్డగోలు వ్యవహారం.. ఫిర్యాదుల వెల్లువ



అక్షరదర్బార్, హనుమకొండ: వివిధ ప్రభుత్వ శాఖల్లో కొంతమంది అధికారులు నిబంధనలను పాతరేస్తున్నారు. తమ స్వప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. తాము పని చేసే కార్యాలయంలోని ప్రభుత్వ సిబ్బందిని సొంత పనులకు వినియోగించుకుంటున్నారు. అద్దె వాహనాల స్థానంలో సొంత వెహికల్స్ వాడుతూ ప్రభుత్వ నిధుల నుంచి రెంట్ పొందుతున్నారు. తాజాగా భూపాలపల్లి జిల్లాలో ఇలాంటి ఆరోపణలపై సర్వత్రా చర్చ జరుగుతుంది. జిల్లా కేంద్రమైన భూపాలపల్లి మున్సిపాలిటీలోని ఒక అధికారిపై ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదుతో ఆఫీసర్స్ అధికార దుర్వినియోగంపై ప్రస్తుతం హాట్ టాపిక్ నడుస్తుంది.

సొంత పనులకు మున్సిపల్ సిబ్బంది!

భూపాలపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలోని ఓ అధికారి మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బందిలోని ముగ్గురిని తన సొంత పనులకు వినియోగించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఒకరిని తన వెహికల్ డ్రైవర్ గా, మరొకరిని కంప్యూటర్ ఆపరేటర్ కమ్ సీసీగా, ఇంకొకరిని తన వంట మనిషిగా వాడుకుంటున్నారని సదరు అధికారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలోని మరో ఉన్నతాధికారి కూడా మూడేళ్లకు పైగా భూపాలపల్లి మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుల్లో ఒకరిని వంట మనిషిగా వినియోగించుకుంటున్నారని ఫిర్యాదుదారులు పేర్కొన్నట్లు సమాచారం. ప్రజలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న డబ్బు నుంచి మున్సిపాలిటీ సిబ్బందికి వేతనాలు అందజేస్తున్న పరిస్థితి. ఈ సిబ్బంది చేయాల్సిన పారిశుద్ధ్య పనులను పక్కనపెట్టి ప్రజల సొమ్ముతో వేతనాలు పొందుతున్న సిబ్బందిలో నలుగురిని అధికారులు తమ సొంత పనులకు వినియోగించుకుంటున్నారనే ఫిర్యాదు స్థానికంగా కలకలం రేపుతుంది.

అద్దె వాహనం స్థానంలో సొంత వెహికల్

మున్సిపల్ సిబ్బందిని తన సొంత పనులకు వినియోగించుకుంటున్నారనే ఆరోపణ కలిగిన మున్సిపాలిటీ అధికారి అద్దె వాహనం స్థానంలో తన సొంత వెహికల్ వాడుతున్నారనే ఫిర్యాదు లోకల్ గా సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. సదరు అధికారికి ప్రభుత్వం సమకూర్చిన అద్దె వాహనాని(కారు)కి మున్సిపాలిటీ నుంచి నెల నెలా రూ.35వేల రెంట్ చెల్లిస్తున్నట్లు తెలిసింది. అయితే టాక్సీ ప్లేట్ కలిగిన ఓ వాహనానికి ఇలా అద్దె చెల్లిస్తూ ఓన్ ప్లేట్ కలిగిన తన సొంత వాహనాన్ని ఆయన వాడుతున్నారనేది ఆరోపణ. ఈయన మున్సిపల్ సిబ్బందిని సొంత పనులకు వినియోగించుకోవడం, టాక్సీ ప్లేట్ వాహనానికి మున్సిపాలిటీ నుంచి అద్దె చెల్లిస్తూ తన సొంత వాహనాన్ని వాడటం అధికార దుర్వినియోగానికి, అక్రమాలకు పాల్పడటమేనని తెలుగుదేశం పార్టీ నాయకుడు ఎస్ పీకే సాగర్ కొద్ది రోజుల క్రితం ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ అంశంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా

సమయస్ఫూర్తితో 71 మంది ప్రాణాలు కాపాడిన ప్రయాణికుడు

- కాజీపేట వద్ద ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్‌కు అకస్మాత్తుగా ఫిట్స్
- అప్రమత్తమై బస్సును నిలిపిన బానోత్ రాంకోటి..
- తప్పిన పెను ప్రమాదం
- రాంకోటి ధైర్యసాహసాలపై మంత్రి పొన్నం ప్రశంసలు

అక్షరదర్బార్, కాజీపేట: కదులుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో అప్రమత్తమైన ఓ ప్రయాణికుడు సమయస్ఫూర్తితో బస్సును నిలిపివేసి 71 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడారు. కాజీపేట సమీపంలో గురువారం జరిగిన ఈ ఘటనలో పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అసలేం జరిగిందంటే.. వరంగల్ డిపో-2 పరిధిలోని టీజీఎస్ఆర్టీసీ ఎలక్ట్రిక్ జేబీఎం ఎక్స్‌ప్రెస్ బస్సు (టీజీ03టీ1550) గురువారం హనుమకొండ నుంచి ఉప్పల్ క్రాస్ రోడ్‌కు 71 మంది ప్రయాణికులతో బయలుదేరింది. మధ్యాహ్నం 2:15 గంటల సమయంలో బస్సు కాజీపేటలోని డీజిల్ కాలనీ సమీపానికి చేరుకోగానే డ్రైవర్ పి రాజు (బీ/3152)కు ఒక్కసారిగా ఫిట్స్ వచ్చాయి. దీంతో ఆయన స్టీరింగ్‌పై పడిపోతుండటాన్ని గమనించిన కండక్టర్ బి విజయ్ వెంటనే డ్రైవర్‌ను పైకి లేపి బస్సును ఆపేందుకు ప్రయత్నించారు.

అప్రమత్తమైన మాజీ ఐటీఐ అప్రెంటిస్

అదే సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న బనోత్ రాంకోటి పరిస్థితి తీవ్రతను వెంటనే గ్రహించారు. క్షణం కూడా ఆలస్యం చేయకుండా డ్రైవర్ సీటు వద్దకు చేరుకుని చాకచక్యంగా బ్రేకులు వేసి బస్సును నిలిపివేశారు. గతంలో ఆయన జేఎన్ డిపోలో ఐటీఐ అప్రెంటిస్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో బస్సును సురక్షితంగా ఆపగలిగారు. ఆయన చూపిన తెగువ వల్ల బస్సులోని 71 మంది ప్రయాణికులతో పాటు రోడ్డుపై వెళ్తున్న ఇతర వాహనదారులకు కూడా పెను ముప్పు తప్పింది.

ఆసుపత్రికి డ్రైవర్ తరలింపు

సమాచారం అందుకున్న కాజీపేట ఏసీపీ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని, అస్వస్థతకు గురైన డ్రైవర్ రాజును చికిత్స నిమిత్తం రోహిణి ఆసుపత్రికి తరలించారు. వరంగల్ డిపో-2 మేనేజర్ కూడా అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనలో ప్రయాణికులెవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందన

ఆపద సమయంలో ఏమాత్రం ఆందోళన చెందకుండా బాధ్యతతో వ్యవహరించి 71 మంది ప్రాణాలను కాపాడిన బనోత్ రాంకోటిని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా అభినందించారు. రాంకోటి చూపిన మానవత్వం, సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలు అందరికీ ఆదర్శమని మంత్రి ప్రశంసించారు.

స్నాతకోత్సవానికి కేయూ ముస్తాబు

- రేపు ఘనంగా వేడుకలు
- అధ్యక్షత వహించనున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- ముఖ్య అతిథిగా పద్మశ్రీ బీవీఆర్ మోహన్ రెడ్డి
- 91 మందికి పీహెచ్‌డీ పట్టాలు, 408 మంది విద్యార్థులకు బంగారు పతకాల ప్రదానం
- 151 మంది సభ్యులతో 12 కమిటీల ఏర్పాటు
- వివరాలు వెల్లడించిన వీసీ ఆచార్య కె ప్రతాప్ రెడ్డి



అక్షరదర్బార్, కేయూక్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) 24వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 28న వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉపకులపతి (వీసీ) ఆచార్య కె ప్రతాప్ రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం విశ్వవిద్యాలయ సెనేట్ హాల్‌లో రిజిస్ట్రార్ ఆచార్య వి రామచంద్రం, ఓఎస్‌డీ ఆచార్య బి వెంకట్రామరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్టతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు.

ఉదయం 9.25 గంటల నుంచే వేడుకలు

2022 నుండి 2025 విద్యా సంవత్సరాలకు సంబంధించిన పట్టాలను ప్రదానం చేసేందుకు శనివారం ఉదయం 9.25 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఈ వేడుకలు జరగనున్నాయని వీసీ పేర్కొన్నారు. ఈ వేడుకలకు విశ్వవిద్యాలయ ఛాన్సలర్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉదయం 11 గంటలకు విచ్చేసి అధ్యక్షత వహిస్తారు. హైదరాబాద్‌కు చెందిన సైయెంట్ సంస్థ వ్యవస్థాపకులు, పద్మశ్రీ డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవ ప్రసంగం చేస్తారు (ఆయన ఉదయం 10.50 గంటలకు క్యాంపస్‌కు చేరుకుంటారు). మాజీ వీసీలు, పాలక మండలి, అకడమిక్ సెనేట్ సభ్యులు, డీన్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

పట్టాలు, బంగారు పతకాల వివరాలు

ప్రోటోకాల్ ప్రకారం అకడమిక్ సెనేట్ సమావేశం, గ్రూప్ ఫొటో, అకడమిక్ ప్రాసెషన్ అనంతరం జాతీయ గీతం, జాతీయ గేయం, తెలంగాణ రాష్ట్ర గీతాలాపనతో కార్యక్రమం మొదలవుతుంది. ఛాన్సలర్ అనుమతితో స్నాతకోత్సవ ప్రక్రియ ప్రారంభమవుతుంది. వివిధ ఫ్యాకల్టీల డీన్లు మొత్తం 91 మంది పీహెచ్‌డీ పట్టభద్రుల పేర్లను చదివి వినిపించి పట్టాలు అందజేస్తారు. విద్యా ప్రతిభ కనబరిచిన మొత్తం 408 మంది విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేయనున్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు వివిధ దాతలు, దాతృత్వ సంస్థలు 105 బంగారు పతకాలను ఏర్పాటు చేశాయని వీసీ వివరించారు. మధ్యాహ్నం 12.45 గంటలకు కార్యక్రమం ముగుస్తుంది.

కమిటీల ఏర్పాటు - నిబంధనలు

స్నాతకోత్సవాన్ని విజయవంతం చేసేందుకు మొత్తం 151 మంది సభ్యులతో స్టీరింగ్, రిసెప్షన్ తదితర 12 కమిటీలను ఏర్పాటు చేశామని, అవన్నీ సమన్వయంతో పనిచేస్తున్నాయని వీసీ తెలిపారు. వేడుకలో పాల్గొనే అధికారులు, అధ్యాపకులు, కమిటీ సభ్యులు, ఉద్యోగులందరూ తప్పనిసరిగా తెల్లని దుస్తులు ధరించాలని ఆదేశించారు. పట్టాలు అందుకునే ప్రతి అభ్యర్థితో పాటు ఒకరికి మాత్రమే సహాయకుడిగా ఆడిటోరియంలోకి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ఆహ్వానితులు, సిబ్బంది నిర్దేశించిన ప్రోటోకాల్‌ను ఖచ్చితంగా పాటించాలని వీసీ సూచించారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా శనివారం ఉదయం 10:30 గంటలకు హెలికాప్టర్ ద్వారా హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ కు చేరుకొని 11 గంటలకు కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ లోని ఆడిటోరియంకు వస్తారు.



కొత్త బోర్లు వేయొద్దు

- అనుమతి లేకుండా వేస్తే వాహనాలు సీజ్ చేస్తాం
- వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలకు భూగర్భ జల శాఖ అనుమతి తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ స్పష్టం


అక్షరదర్బార్, హనుమకొండ: నివాస గృహాలు, వ్యవసాయ అవసరాలకు మినహా కమర్షియల్, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమల కోసం బోర్‌వెల్ వేయాలంటే భూగర్భ జల శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ స్పష్టం చేశారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రస్తుత 'ఎల్ నినో' పరిస్థితుల్లో బోర్‌వెల్ అనుమతులు, భూగర్భ జలాల సంరక్షణ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.

రిగ్ యజమానులు, వాటర్ సప్లయర్లకు హెచ్చరిక

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలను అన్ని శాఖల అధికారులు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. రిగ్ వాహనాల యజమానులు అనుమతి పత్రాలు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్త బోర్లు వేయొద్దని హెచ్చరించారు. అలాగే బల్క్ వాటర్ సప్లయర్లు కూడా అనుమతులు లేకుండా భూగర్భ జలాలను వెలికితీయొద్దని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం భారీ జరిమానా విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేసే అధికారం అధికారులకు ఉందని హెచ్చరించారు.

ఇంకుడు గుంతలతో జల సంరక్షణ

ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా ప్రజలందరూ భూగర్భ జలాలను అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి, వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, జడ్పీ సీఈవో శేషాద్రి, డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా భూగర్భ జల అధికారి శైల శ్రీ మల్లికా దేవి, అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్ట్ రవీందర్, అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ రవళి, పలువురు జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, రిగ్ వాహనాల యజమానులు పాల్గొన్నారు.



పార్లమెంటు సమావేశాల డేట్ ఫిక్స్

- 30న లోక్‌సభ, డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశాలు
- డిసెంబర్ 3 వరకు సాగనున్న ఉభయ సభల కార్యకలాపాలు
- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం

అక్షరదర్బార్, న్యూఢిల్లీ: కీలకమైన ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహించేందుకు పార్లమెంటు ఉభయ సభల ప్రత్యేక సమావేశాలు ఈ నెలాఖరున ప్రారంభం కానున్నాయి. నవంబర్ 30న లోక్‌సభ, డిసెంబర్ 2న రాజ్యసభ తిరిగి సమావేశం కానున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్‌లను ప్రభుత్వం కోరినట్లు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సమావేశాలు డిసెంబర్ 3న ముగిసే అవకాశం ఉందని తెలిపారు.

కీలక బిల్లులపై జోరుగా ఊహాగానాలు

ఈ ప్రత్యేక సమావేశాల్లో దేశ రాజకీయాలను ప్రభావితం చేసే నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన కీలక బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టవచ్చనే ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. అయితే, సభలో ఏయే బిల్లులను చేపడతారనే విషయంపై ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు.

నేడు కేంద్ర మంత్రివర్గ భేటీ

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గం శుక్రవారం సమావేశం కానుంది. ఈ భేటీలో డీలిమిటేషన్, మహిళా బిల్లుల అంశాలపై ప్రధానంగా చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

తెలంగాణ ఉద్యమానికి కీలక మలుపు కేసీఆర్ దీక్ష

- 29న నిర్వహించే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి
- బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపు



అక్షరదర్బార్, పరకాల : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఉద్యమ చరిత్రలో చిరస్మరణీయ ఘట్టమని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో ప్రాణత్యాగానికి సైతం సిద్ధపడి ఆయన చేసిన దీక్షతోనే ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడి రాష్ట్ర సాధనకు బాటలు పడ్డాయని పేర్కొన్నారు. ఈ నెల 29న పరకాలలో నిర్వహించనున్న 'దీక్షా దివస్' కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మాజీ నక్సల్స్‌కు పునరావాసంపై సమీక్ష

- జిల్లాలో అర్హులైన 11 మందికి ఇళ్ల స్థలాల కేటాయింపుపై ప్రధాన చర్చ
- ప్రభుత్వ లేదా ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించాలని అధికారులకు ఆదేశం
- సమన్వయంతో పనిచేసిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, సీపీ ఎన్ శ్వేత



అక్షరదర్బార్, హనుమకొండ: జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ నక్సల్స్‌కు ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, వారికి మెరుగైన జీవనోపాధి కల్పించే దిశగా అధికార యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఈ మేరకు గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేతల సమక్షంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం జరిగింది.

11 మందికి ఇళ్ల స్థలాల కేటాయింపుపై చర్చ

హనుమకొండ జిల్లా పరిధిలో పునరావాసానికి అర్హులైన 11 మంది లొంగిపోయిన మాజీ నక్సల్స్‌కు ఇళ్ల స్థలాలు కేటాయించే అంశంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం అనువైన ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించాలని కలెక్టర్, సీపీ సంబంధిత క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. ఒకవేళ ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించి, తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

జాప్యం లేకుండా సంక్షేమ ఫలాలు

లబ్ధిదారులకు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా సకాలంలో అందేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. పునరావాస ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, డీఆర్డీవో మేన శ్రీను, గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధార్థ నాయక్, ఆర్ అండ్ బీ ఈఈ దేవిక చౌహాన్, ఏసీపీ జానీ నరసింహులు, పలువురు తహసీల్దార్లు, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అడ్డుగా ఉన్నాడని భర్తను కడతేర్చిన భార్య

- ప్రియుడితో కలిసి నిద్రిస్తున్న భర్త గొంతు నులిమి హత్య
- గుండెపోటుగా చిత్రీకరించేందుకు నిందితుల యత్నం..
- పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి అసలు నిజం
- గూడూరు మండలం అయోధ్యపురంలో ఘటన.. ఇద్దరు నిందితుల అరెస్ట్



అక్షరదర్బార్, గూడూరు: వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన ఓ భార్య, తన ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తను అత్యంత దారుణంగా హతమార్చింది. ఆపై ఏమీ తెలియనట్లు గుండెపోటుగా చిత్రీకరించే ప్రయత్నం చేసినా, పోలీసుల విచారణలో అసలు నిజం బయటపడింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అయోధ్యపురం గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి నిందితులైన భార్య, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

అసలేం జరిగిందంటే..

అయోధ్యపురం గ్రామానికి చెందిన మంజుల (36)కు ఆవుదెడ్డి రాజు (26) అనే యువకుడితో వివాహేతర సంబంధం ఏర్పడింది. వీరి అక్రమ సంబంధానికి మంజుల భర్త సారయ్య అడ్డుగా మారాడు. దీంతో ఎలాగైనా సారయ్యను అడ్డు తొలగించుకోవాలని మంజుల, రాజు కలిసి పథకం పన్నారు.

నిద్రలోనే ఊపిరి తీశారు

పథకం ప్రకారం ఈ నెల 19న రాత్రి సారయ్య గాఢ నిద్రలో ఉన్న సమయంలో మంజుల, రాజు కలిసి అతనిపై దాడి చేశారు. సారయ్య ముఖంపై దుప్పటి కప్పి ఊపిరాడకుండా చేసి, గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం ఈ హత్యను సహజ మరణంగా నమ్మించేందుకు, సారయ్య గుండెపోటుతో మృతి చెందినట్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు.

పోలీసుల దర్యాప్తులో వీడిన మిస్టరీ

సారయ్య మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేపట్టారు. విచారణలో మంజుల, రాజుల వ్యవహారంపై పోలీసులకు కీలక ఆధారాలు లభించాయి. దీంతో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, తామే హత్య చేసినట్లు అంగీకరించారు. ఈ మేరకు గూడూరు సీఐ వి వినయ్ కుమార్, ఎస్ఐ సీహెచ్. రమేష్ బాబు నిందితులు మంజుల, రాజులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన దుప్పటితో పాటు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణుల సందడి

- హైదరాబాద్‌లోని 'సంవిధాన్ రక్ష మార్చ్'లో పాల్గొన్న పరకాల నేతలు
- ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే లక్ష్యంగా భారీ ప్రదర్శన



అక్షరదర్బార్, పరకాల : టీపీసీసీ, ఏఐసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'సంవిధాన్ రక్ష మార్చ్' రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో పరకాల పట్టణ కాంగ్రెస్ నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణ అధ్యక్షుడు ఒంటేరు శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు ఈ కార్యక్రమానికి తరలివెళ్లారు. ట్యాంక్‌బండ్ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు సాగిన ఈ భారీ ప్రదర్శనలో భాగస్వాములై, రాజ్యాంగం మరియు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని నినదించారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్

- పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఆల్ ఇన్ వన్' పుస్తకాల పంపిణీ
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్ష



అక్షరదర్బార్, పరకాల : శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పరకాల మండలం వెల్లంపల్లి, నాగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా 'ఆల్ ఇన్ వన్' స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందులతో ఏ విద్యార్థీ చదువుకు దూరం కాకూడదని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఆముదలపల్లి అశోక్ గౌడ్, గంట సమ్మిరెడ్డి, ఏరుకొండ శ్రీనివాస్, పిట్ట సునీల్, కాసగాని సంపత్, మునిగాల విద్యాసాగర్ రావు, గుండెబోయిన నాగన్న, చింతిరెడ్డి రత్నాకర్ రెడ్డి, నరహరి సురేందర్ రెడ్డి, ఏరుకొండ ఆనందం, వార్డు సభ్యులు పసుల కావ్య, అరె సాంబరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతీయుల జీవితాల్లో వెలుగులు నింపిన రాజ్యాంగం

- ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యున్నత రాజ్యాంగం మనదే
- అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు



అక్షరదర్బార్, మొగుళ్లపల్లి : భారత రాజ్యాంగం దేశ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిందని, ప్రపంచంలోనే అతిపెద్దమరియు గొప్ప రాజ్యాంగం మనదేనని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి అన్నారు. గురువారం మొగుళ్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఉన్నత పాఠశాల నుండి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తక్కలపల్లి రాజు, నడిగోటి రాము, ఏలేటి శివారెడ్డి, రమేష్, పడిదల నర్సింగరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మోరే రవీందర్ రెడ్డి, అంబేడ్కర్ సంఘం నాయకులు మంద సాంబయ్య, నిమ్మల భద్రయ్య, కట్కూరి ఐలయ్య, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బండారి రాజు, ఇస్పేట సర్పంచ్ యారా ముకుంద రెడ్డి, గుడిమల్ల రమేష్, శనిగరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో అన్నదాత బలవన్మరణం

- పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న కౌలు రైతు
- చికిత్స పొందుతూ మృతి
- రూ.6 లక్షల అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపం

అక్షరదర్బార్, నడికూడ : అప్పుల బాధ తాళలేక ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న ఓ రైతు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సర్వాపూర్ గ్రామానికి చెందిన బోగి ప్రసాద్ (43) తనకున్న 1.20 ఎకరాల భూమితో పాటు మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పెట్టుబడులు, కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు ఐదేళ్ల క్రితం 20 గుంటల భూమిని విక్రయించినా, ఇంకా రూ.6 లక్షల వరకు అప్పులు మిగిలాయి. వాటిని ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురైన ప్రసాద్, ఈ నెల 21న సాయంత్రం ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన భార్య రాజేశ్వరి స్థానికుల సహాయంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు దామెర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు విద్యార్థులు చైతన్యం కావాలి

- అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత ముందుండాలి
- భారీ ర్యాలీ నిర్వహించి నివాళులర్పించిన ఏబీఎస్ఎఫ్ నేతలు



అక్షరదర్బార్, నర్సంపేట : భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయంపై విద్యార్థులు అవగాహన పెంచుకుని రాజ్యాంగ పరిరక్షణకు చైతన్యవంతులు కావాలని ఏబీఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని రాజ్యాంగ విలువలను కాపాడేందుకు యువత నడుం బిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



రాజ్యాంగమే మన ఆత్మ, మన గౌరవం

- జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం
- అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి ర్యాలీ తీసిన విద్యార్థులు

అక్షరదర్బార్, మొగుళ్లపల్లి : భారత రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం మాత్రమే కాదని, అది మన ఆత్మ, మన హక్కులకు రక్షణ కవచమని మొగుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎస్. భాగ్యశ్రీ అన్నారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆమె అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో రాజ్యాంగ పీఠికను చదివించి ప్రతిజ్ఞ చేయించారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రతి భారతీయుడి జీవన విధానం కావాలని ఆమె ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు టి. వెంకన్న, డి. పద్మ రాజ్యాంగ విశిష్టతను వివరించగా, ఎన్సీసీ అధికారి గుండెల్లి రాజయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎన్సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఐకేపీ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్
- అదనపు కలెక్టర్ ఎన్. రవి
- పెద్దకోడెపాక కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ
- గన్నీ బ్యాగులు తెప్పించాలని ఆదేశం

అక్షరదర్బార్, శాయంపేట : రైతులు పండించిన ధాన్యాన్ని దళారులు, ప్రైవేట్ మిల్లులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి సూచించారు. గురువారం ఆయన శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ అందిస్తోందని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్రంలో గన్నీ బ్యాగుల కొరతపై అధికారులను ఆరా తీసి, తక్షణమే సరిపడా బ్యాగులను తెప్పించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఆర్. ప్రవీణ్ కుమార్, చీమన్ నాయక్, స్థానిక సర్పంచ్ దీనా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికి రికార్డు ధర.. క్వింటాల్ రూ.9,150

- రాష్ట్రంలోని ఇతర మార్కెట్ల కంటే జమ్మికుంటలోనే అత్యధికం
- వారం రోజుల్లోనే రూ.170 పెరగడంతో రైతుల్లో ఆనందం

అక్షరదర్బార్, మొగుళ్లపల్లి : కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర మరోసారి భారీగా పెరిగి రికార్డు స్థాయికి చేరుకుంది. బుధవారం క్వింటాల్ పత్తికి గరిష్టంగా రూ.9,150, కనిష్టంగా రూ.8,900 ధర పలకడంతో అన్నదాతల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. గత వారం కంటే తాజాగా క్వింటాల్‌పై రూ.170 మేర ధర పెరగడం గమనార్హం. రాష్ట్రంలోని పెద్దపల్లి, ఆదిలాబాద్ మార్కెట్లలో రూ.9,110, వరంగల్‌లో రూ.9,100, ఖమ్మంలో రూ.9,050 నమోదు కాగా, జమ్మికుంట మార్కెట్‌లోనే అత్యధిక ధర పలికింది. మొగుళ్లపల్లి మండలంతో పాటు పరిసర గ్రామాల నుండి రైతులు 136 ట్రాలీల పత్తిని మార్కెట్‌కు విక్రయానికి తీసుకువచ్చారు. మార్కెట్‌కు పత్తి రాక తగ్గడం, పత్తి గింజల ధర పెరగడంతో వ్యాపారులు కొనుగోలుకు పోటీ పడ్డారని అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

కిసాన్ మేళాను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలి

- ఈ నెల 28న ఇంచెర్లలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం
- ఆధునిక సాగు మెళకువలు, వాతావరణ మార్పులపై శాస్త్రవేత్తల అవగాహన



అక్షరదర్బార్, ములుగు : జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ శనివారం ములుగు మండలం జంగాలపల్లి క్రాస్ సమీపంలోని ఇంచెర్ల గ్రామంలో గల ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో 'కిసాన్ మేళా' నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని వివిధ పంటల సాగులో ఆధునిక పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే మెళకువలపై రైతులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా నూనెగింజలు, చిరుధాన్యాల సాగు ప్రాముఖ్యతతో పాటు, వరంగల్ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక సూచనలు అందిస్తారన్నారు. జిల్లాలోని రైతులందరూ ఈ మేళాకు పెద్ద సంఖ్యలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



జాతరలో మహిళలు, చిన్నారుల భద్రతకు భరోసా

- ఆపద వేళ అండగా నిలిచే హెల్ప్‌లైన్ నంబర్లపై భక్తులకు అవగాహన
- బుగులోని జాతరలో పోస్టర్లు ఆవిష్కరించిన అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్

అక్షరదర్బార్, భూపాలపల్లి క్రైమ్ : జాతరలు, జనసమ్మర్ద ప్రాంతాల్లో మహిళలు, చిన్నారుల భద్రతకు భరోసా కల్పించడంతో పాటు ఆపద సమయాల్లో తక్షణ సహాయం పొందేలా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించింది. రేగొండ మండలం తిరుమలగిరిలోని ప్రసిద్ధ బుగులోని జాతరలో గురువారం భక్తులకు ప్రభుత్వ హెల్ప్‌లైన్ సేవలపై విస్తృతంగా ప్రచారం కల్పించారు. జిల్లా సంక్షేమ అధికారి మల్లేశ్వరి సూచనల మేరకు సఖి కేంద్రం, బాలల హక్కుల విభాగం, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది కలిసి 1098, 181, 14567, 100 టోల్ ఫ్రీ నంబర్ల ప్రాధాన్యతను వివరించారు. సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ గాయత్రి మాట్లాడుతూ.. వేధింపులు, కుటుంబ సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు కౌన్సెలింగ్, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, సీఐ రత్నాకర్ రావు, ఎస్సైలు భద్రతా అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాధవి, సుమలత, కుమార్, ప్రవీణ్ కుమార్, సాయి, మమత తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడాలి

- కనీస మద్దతు ధర చట్టం, సంపూర్ణ రుణ విముక్తి కల్పించాలి
- వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో సంయుక్త కిసాన్ మోర్చా రాస్తారోకో



అక్షరదర్బార్, వరంగల్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడి, పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించడంతో పాటు సంపూర్ణ రుణ విముక్తి చట్టం తీసుకురావాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్ ప్రధాన రహదారిపై వివిధ రైతు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. జిల్లా కన్వీనర్ కుసుంబ బాబూరావు అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో రమేష్ మాట్లాడుతూ.. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పేరుతో విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతి సుంకాలను తగ్గించి దేశీయ రైతాంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని మండిపడ్డారు. కార్పొరేట్లకు లక్షల కోట్లు మాఫీ చేస్తున్న పాలకులు, దేశానికి వెన్నెముకైన రైతుల రుణాలను ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ ఆందోళనలో జిల్లా కన్వీనర్లు ఈసంపెల్లి బాబు, చుక్క మొగిలి, చిర్ర సూరి, రాచర్ల బాలరాజు, సోమిడి శ్రీనివాస్, సుధమల్ల భాస్కర్, నాయకులు సింగతి సాంబయ్య, ఆరెల్లి కృష్ణ, పుచ్చకాయల కృష్ణారెడ్డి, సుంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పీఆర్సీ, డీఏలను తక్షణమే విడుదల చేయాలి

- అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో హెల్త్ కార్డులను అమలు చేయాలి
- టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్
- కాటారం యూనిట్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



అక్షరదర్బార్, భూపాలపల్లి రూరల్ : మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ ని తక్షణమే అమలు చేయడంతో పాటు, పెండింగ్ డీఏలు, బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు బూరుగు రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాటారం యూనిట్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఉద్యోగుల హెల్త్ కార్డులను అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. అనంతరం ఎన్నికల అధికారి కె. సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాటారం యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి. వెంకటయ్య (ఆర్ఐ), కార్యదర్శిగా ఎం. శ్రీధర్ బాబు (సూపరింటెండెంట్), కోశాధికారిగా ఎల్. దివ్యజ్యోతి (ఏఈవో), ఉపాధ్యక్షులుగా ఎస్. రాంగోపాల్ రెడ్డి, ఎస్. మల్లికార్జున్, సంయుక్త కార్యదర్శులుగా ఎ. శంకరయ్య, టి. పద్మావతి, ప్రచార కార్యదర్శిగా కె. రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సంపత్, ఈసీ సభ్యులుగా జె. రమాకాంత్, బి. నరేష్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎ. దశరథ రామారావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజప్రకాష్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో రాజ్యాంగ అవగాహన పెంపొందించాలి

- మూడు భాషల్లో పీఠికను పఠించిన గురుకుల విద్యార్థులు
- 395 అధికరణాల ప్రదర్శన, వ్యాసరచన, క్విజ్ పోటీలు



అక్షరదర్బార్, శాయంపేట : విద్యార్థుల్లో చిన్నతనం నుంచే భారత రాజ్యాంగంపై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించాలని శాయంపేట–ములుగు ఎంజేబీసీడబ్ల్యూ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ టి. రేవతి అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పాఠశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాజ్యాంగ పీఠికను తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో సామూహికంగా పఠించారు. రాజ్యాంగంలోని 395 అధికరణాలను ప్రదర్శించి విద్యార్థులతో చదివించారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు బీమా కొనసాగింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

- ఇందిరమ్మ బీమాలో పాత పథకాల విలీనంపై ప్రజల్లో తీవ్ర సందిగ్ధత
- పెండింగ్ క్లెయిమ్‌లు, ప్రీమియం చెల్లింపులపై వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్



అక్షరదర్బార్, చిట్యాల : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' నేపథ్యంలో గతంలో ఉన్న వివిధ బీమా పథకాల కొనసాగింపుపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను తక్షణమే నివృత్తి చేయాలని బీఆర్ఎస్ చిట్యాల మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం చిట్యాల మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. పాత బీమా పథకాలను కొత్త పథకంలో విలీనం చేస్తున్నారా? లేక రద్దు చేస్తున్నారా? అనే విషయంపై ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయాలని కోరారు. ముఖ్యంగా అన్నదాతలకు భరోసానిచ్చే 'రైతు బీమా' కొనసాగుతుందా లేదా అనే అంశంపై రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. గతంలో ఒకే కుటుంబంలో ఎంతమంది పట్టాదారు రైతులు ఉంటే అందరికీ రైతు బీమా వర్తించేదని, ఇప్పుడు కుటుంబంలో ఒక్కరికే పరిమితం చేస్తే మిగతా వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అలాగే కార్మిక, గీత, చేనేత, మత్స్యకారుల బీమా పథకాల భవితవ్యంపై స్పష్టత ఇవ్వాలన్నారు. కొంతకాలంగా రైతు బీమా ప్రీమియం చెల్లింపులు నిలిచిపోయి, మరణించిన రైతు కుటుంబాలకు పరిహారం అందడం లేదని ఆరోపించారు. పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించి అర్హులైన కుటుంబాలకు న్యాయం చేయాలని రవీందర్ కోరారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడాలి

- కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ ఎన్. రవి
- ముస్త్యాలపల్లిలో భూ రీసర్వే పనుల పరిశీలన



అక్షరదర్బార్, పరకాల : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. గురువారం పరకాల పీఏసీఎస్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రంతో పాటు శాయంపేట మండలం పెద్దకోడెపాక కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి, రైతులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం నడికూడ మండలం ముస్త్యాలపల్లిలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనులను త్వరగా పూర్తి చేయాలని సర్వేయర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకమల్ల వెంకటేష్, సర్వే ఏడీ నూర్ సింగ్, పరకాల ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్లు విజయలక్ష్మి, రాణి, ప్రవీణ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో కీలకం

- నాగయ్యపల్లిలో నూతన కెమెరాలను ప్రారంభించిన సీఐ బాబూలాల్
- ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచన



అక్షరదర్బార్, ఆత్మకూర్ (దామెర) : గ్రామాల్లో నేరాల నియంత్రణకు, దర్యాప్తు ప్రక్రియ వేగవంతం కావడానికి సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని ఆత్మకూరు సీఐ బాబూలాల్ అన్నారు. గురువారం ఆత్మకూరు మండలం నాగయ్యపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలు బిగించుకోవడం వల్ల గ్రామానికి పూర్తి భద్రత లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుండాల క్రాంతి, మాజీ సర్పంచ్ పురం కుమారస్వామి, పరకాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్, ఉపసర్పంచ్ నేరెళ్ల కరుణాకర్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నేరెళ్ల రవీందర్, కార్యదర్శి రవికుమార్, నాయకులు జినుక అశోక్, మదాసి శ్రీనివాస్, గిన్నారపు భాస్కర్, విజేందర్, ప్రవీణ్, నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బీమాతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

- పథకం నమోదును ప్రారంభించిన సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య
- పంచాయతీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ



అక్షరదర్బార్, చిట్యాల : నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని' అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య కోరారు. గురువారం గ్రామపంచాయతీ పరిధిలో ఈ పథకం నమోదును ప్రారంభించి, లబ్ధిదారులకు వివరాలను అందజేశారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పంచాయతీ కార్యదర్శి దేవేందర్ రెడ్డి గ్రామస్తులతో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు తౌటం నవీన్, చెర్ల చందు, మైదం శ్రావ్య శ్రీకాంత్, వేల్పుల లక్ష్మి, శనిగరపు మొగిలి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకే ఆదర్శం మన భారత రాజ్యాంగం

- కులమతాలకు అతీతంగా రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి
- అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు



అక్షరదర్బార్, చిట్యాల : ప్రపంచ దేశాలకే ఆదర్శవంతమైన అతిపెద్ద లిఖిత పూర్వక రాజ్యాంగం మనదని, కులమతాలకు అతీతంగా దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని చిట్యాల తహసీల్దార్ వసంతరావు, సీఐ సతీష్ అన్నారు. గురువారం చిట్యాల మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నె యుగేందర్ అధ్యక్షతన 77వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన అధికారులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండేళ్ల 11 నెలల 18 రోజులు శ్రమించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్లే నేడు అందరికీ సమాన హక్కులు, ఓటు హక్కు లభించాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బి. శ్రీకాంత్, అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పుల్ల మల్లయ్య, వార్డు సభ్యులు పుల్ల నిర్మల, సతీష్ కుమార్, తౌటం నవీన్, శనిగరపు మొగిలి, అంబేడ్కర్ వాదులు కట్కూరి మొగిలి, గురుకుంట్ల కిరణ్, పాముకుంట్ల చందర్, గడ్డం సదానందం, రాజమౌళి, అధ్యాపకులు రాజు, యుగంధర్, తిరుమలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పరిధిలోని బావులపై సమగ్ర సర్వే

- నష్టపరిహారం అంచనా కోసం ఊరుగొండలో క్షేత్రస్థాయి పరిశీలన
- తాగునీటి బావి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్న ఆర్ఐ



అక్షరదర్బార్, దామెర : విజయవాడ–నాగ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భూములు, వ్యవసాయ బావులు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం అందించేందుకు రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే చేపట్టారు. గురువారం దామెర మండలం ఊరుగొండ గ్రామపంచాయతీ పరిధిలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రైతులతో కలిసి వ్యవసాయ బావుల వివరాలను క్షేతస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ.. హైవే అలైన్‌మెంట్‌లో గ్రామానికి తాగునీరు అందించే బావి కూడా ఉందని, ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలేపాక శ్రీనివాస్, జీపీఓ విజేందర్, రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆదర్శాలను జీవితంలో ఆచరించాలి

- న్యూ విజన్ హైస్కూల్‌లో ఘనంగా 77వ సంవిధాన్ దివస్
- అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ



అక్షరదర్బార్, దుగ్గొండి : దుగ్గొండి మండలం గిర్నిబావి గ్రామంలోని న్యూ విజన్ హైస్కూల్‌లో గురువారం 77వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ హక్కులతో పాటు పౌర బాధ్యతలను కూడా గుర్తెరిగి నడుచుకోవాలని సూచిస్తూ ప్రవేశిక పఠనం, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పోరెడ్డి నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ ఎరుకల మహిపాల్ రెడ్డి, డైరెక్టర్ మోతె రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.